కబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవు



ఎదులాబాద్‌లో కాల్వను పరిశీలిస్తున్న అధికారులు

ఘట్‌కేసర్: ఎదులాబాద్ నారాయణ రావు చానెల్‌ను ఇరిగేషన్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నాగేందర్ ఇతర అధికారులతో కలిసి శనివారం సందర్శించారు. పీర్జాదిగూడలోని నారాయణరావు కత్వ నుంచి ఎదులాబాద్ లక్ష్మీనాయణ చెరువు వరకు ప్రవహిస్తున్న నారాయణ రావు చానెల్‌పై ఉన్న కల్వర్టులు, చెరువు కట్ట తూమును పరిశీలించారు. చానెల్ మరమ్మతుల కోసం రూ.2.25 కోట్లు, కాల్వల మరమ్మతుల కోసం రూ.75 లక్షలు, చెరువు మరమ్మతుల కోసం రూ.1.7 కోట్లు అవసరం ఉన్నందున నిధులు మంజూరు చేస్తామన్నారు. చెరువులు, కాల్వలు, కుంటల కబ్జాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ధర్మ, ఏసీఈలు హైదర్‌ఖాన్, సంజా, ఈఈ బన్సీలాల్, అధికారులు ఉషారాణి, జ్యోతి, ఏఈ పరమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



శామీర్‌పేట్: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్‌ఎంసీ చైర్మన్ రాజిగళ్ల నర్సింహ అన్నారు. మూడుచింతలపల్లి మండలం, ఉద్దమర్రి గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం చైర్మన్ అధ్యక్షతన పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. రాబోయే 10వ తరగతి పరీక్షల్లో కార్యాచరణతో మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి సంకల్ప యాత్రపై అవగాహన



పోచారం: ప్రధాన మంత్రి వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని పోచారం మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. తపాల, బ్యాంకు, ఆరోగ్య, మెప్మా, మున్సిపాలిటీ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నేషనల్ దివ్యాంగ్ జన్ ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ సెక్రటరీ నవీన్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వేమనరెడ్డి, కెనరా బ్యాంక్ నారపల్లి బ్రాంచ్ మేనేజర్ రమావత్ పాండు, కౌన్సిలర్ మమత, మెప్మా అధికారి నర్సింహ, మెడికల్ ఆఫీసర్ శ్రేయ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

– ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్

ఘట్‌కేసర్: పట్టణంలోని శ్రీవిద్యా ఆస్పత్రిలో కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో కొనసాగుతున్న గుండె సంబంధ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, శ్రీవిద్యా ఆస్పత్రులు, ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని శ్రీవిద్యా ఆస్పత్రిలో వైద్య శిబిరం కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. రాంచందర్‌యాదవ్, బస్వరాజ్, రమేశ్‌నాయక్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల్లో చోరీ.. కేసు నమోదు

మేడిపల్లి: తాళం వేసిన 9 దుకాణాల్లో దుండగులు చోరీకి పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఘట్‌కేసర్ మండలం నారాపల్లి ప్రధాన రోడ్డులో శుక్రవారం రాత్రి వరుసగా ఉన్న 9 దుకాణాల్లోకి వెనుక నుంచి వచ్చి పైన ఉన్న సిమెంట్ రేకులను పగులగొట్టి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. శనివారం ఉదయం దుకాణాల యజమానులు వచ్చి దుకాణం లోపల చూడగా.. వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. 5 దుకాణాల్లో సుమారుగా రూ.15వేల నగదు చోరీ కాగా.. వరుసగా మరో 4 దుకాణాల్లో ఎలాంటి నగదు, విలువైన వస్తువులు లేకపోవడంతో ఎలాంటి వస్తువులు చోరీ కాలేదని నిర్వాహకులు తెలిపారు. దుకాణాల యజమానులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చేస్తున్నారు. నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

అభివృద్ధి పనుల పరిశీలన

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణ్‌పురి కాలనీలో రూ.80 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీవరేజ్, స్టామ్‌వాటర్, డ్రైయిన్ పైపులైన్ పనులు పూర్తయిన ప్రాంతాల్లో ప్రణాళిక బద్ధంగా సీసీరోడ్లు వేయిస్తున్నామన్నారు. వర్క్‌ఇన్‌స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ నేతలు కొండల్‌రెడ్డి, జగన్, బాలు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్, గ్యాస్ కొరత రాకుండా చూడాలి

ఉప్పల్: అక్రమంగా ట్యాంకర్ల నుంచి ఆయిల్‌ను తీయడం లాంటి కార్యకలాపాలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని మల్కాజిగిరి డీసీపీ పద్మజా హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ అవరణలో పెట్రోల్ సంస్థల ప్రతినిధులు మల్కాజిగిరి జోన్ పోలీసులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. మున్ముందు ఎలాంటి ఆయిల్, గ్యాస్‌కొరత రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికనుగుణంగా డ్రైవర్లు, కార్మికులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ట్యాంకర్ల నుంచి పెట్రోల్, డిజిల్‌ను దొంగిలించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అదనపు డీసీపీ వెంకటరమణ, మల్కాజిగిరి ఏసీపీ చంద్రశేఖర్, కుశాయిగూడ ఏసీపీ రవీందర్, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బడిలో మోగిన ఎన్నికల గంట

- నాలుగేళ్ల తర్వాత ఎస్‌ఎంసీ ఎన్నికల షెడ్యూల్
- పాఠశాలల్లో తల్లిదండ్రుల పేర్ల జాబితా వెల్లడి
- 29న ఎన్నికల నిర్వహణకు విద్యాశాఖ చర్యలు
- గ్రేటర్, శివారు జిల్లాల్లో 2,447 బడుల్లో ఎన్నికలు



ప్రభుత్వ బడుల్లో ఎస్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తూ..

నిబంధనల ప్రకారం

చైర్మన్, వైస్ చైర్మన్ సహా ఒక్కో తరగతి నుంచి ముగ్గురు ఎన్నికైన తల్లిదండ్రులు సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు మరో ఐదుగురు ఎక్స్ అఫిషియో సభ్యులు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు ఉంటారు. ప్రధానోపాధ్యాయుడు మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. 1 నుంచి 8 తరగతుల్లోని విద్యార్థుల తల్లితండ్రులే సభ్యులుగా ఉంటారు. 9, 10 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీ చేసే అవకాశం లేదు. ఎన్నికలు నిర్వహించే సమయంలో కనీసం 50 శాతం తల్లిదండ్రులు హాజరుకావాలి. చేతులెత్తడం, నోటితో చెప్పే పద్ధతితో ఎన్నికలు నిర్వహించాలి. ఎస్‌ఎంసీల పదవీ కాలం రెండేళ్లు, వారి కాలపరిమితి ముగిసినా, విద్యార్థులు పాఠశాలను వదిలివెళ్లినా ఏది ముందు జరిగితే దాన్ని పరిగణనలోకి తీసుకుని సభ్యత్వం తొలగిస్తారు.

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాల విద్యా కమిటీల పదవీ కాలం తరచూ పొడగిస్తూ వచ్చిన విద్యాశాఖ ఎట్టకేలకు ఎన్నికల షెడ్యూల్ జారీ చేసింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల కోలాహలం నెలకొంది. ప్రభుత్వ బడుల్లో చేపట్టే అభివృద్ధి, ఇతర కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకునే ఎస్‌ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. చివరిసారి 2019 నవంబర్‌లో విద్యా కమిటీ చైర్మన్ ఎన్నిక నిర్వహించింది. అనేక వాయిదాల తర్వాత కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది.

గ్రేటర్ జిల్లాల్లో 2,447 బడులు

గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 2,447 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఇందులో హైదరాబాద్ జిల్లాలో 631 పాఠశాలలు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 515 పాఠశాలలు, రంగారెడ్డి జిల్లాలో 1,301 పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రభుత్వ బడుల్లో 29న ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ప్రభుత్వ బడుల్లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికల్లో పాల్గొనే విధంగా ప్రధానోపాధ్యాయుడు నోటీసు జారీ చేశారు. మధ్యాహ్నం విద్యార్థుల తల్లిదండ్రుల పేర్ల జాబితాను పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. 22న ఎన్నికల్లో పాల్గొనే తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 24న పోటీలో ఉన్నవారి తుది జాబితా ప్రదర్శిస్తారు. 29న ఉదయం 7 గంటల నుంచి ఒంటిగంట వరకు చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తారు. అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు కొత్తగా ఏర్పడిన కమిటీతో సమావేశం నిర్వహించి బడిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించాలి.

ఎస్‌ఎంసీ ప్రధాన లక్ష్యం..

పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతి రెండు నెలలకోసారి ఎస్‌ఎంసీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయాలి. ఎస్‌ఎంసీలు విద్యాలయాల అభివృద్ధిలో ప్రత్యేకత కనబర్చాలి. సూచనలు, సలహాలివ్వడంతో పాటు పాఠశాలకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలి. విద్యాప్రగతి, కార్యక్రమాలపై సమీక్షించాలి. పిల్లల నమోదు సంఖ్య పెంచడం, హాజరు మెరుగుపర్చడంలో భాగస్వాములు కావాలి. 6 నుంచి 14 ఏళ్ల వయస్సు కలిగిన బడీడు విద్యార్థులను గుర్తించి వారిని బడిలో చేర్పించడం. గ్రామ విద్యా రిజిస్టర్ నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షించాలి. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంటోంది.

> **ఎన్నికల ప్రక్రియ పక్కా నిర్వహించాలి**
>
> ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడుతున్నాం. షెడ్యూల్‌ను ప్రధానోపాధ్యాయులు క్షుణంగా చదివి ఎన్నికల ప్రక్రియ పక్కాగా నిర్వహించాలి. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలి.
>
> – ఐ.విజయకుమారి, విద్యాశాఖ అధికారి, మేడ్చల్ జిల్లా

ఫిట్జీ ఆధ్వర్యంలో అతిపెద్ద స్కాలర్‌షిప్ పరీక్ష 28న

సాక్షి, సిటీబ్యూరో: విద్యా సంబంధిత శిక్షణ తరగతులు నిర్వహించే ఫిట్జీ (ఎఫ్ఐఐటీజేఈఈ) సంస్థ ఆధ్వర్యంలో 'ద్రోణాచార్య 360 డిగ్రీ డయాగ్నోస్టిక్స్ స్కాలర్‌షిప్ టెస్ట్'ను నిర్వహించనున్నారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద స్కాలర్‌షిప్ పరీక్షగా సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. 5వ తరగతి నుంచి 11వ తరగతికి మధ్య విద్యార్థులకు ఉపకరించే ఈ స్కాలర్‌షిప్ పరీక్షను ఈ నెల 28న, ఫిబ్రవరి 2న నిర్వహిస్తున్నామని, నగర విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కావాలంటే పరీక్షకు 2 రోజుల ముందే https://dronacharyaexam.fiitjee.com/registration-process.html ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలి

మేడ్చల్: 18 సంవత్సరాల వయస్సు ఉన్న యువతీ యువకులు ఓటు కోసం నమోదు చేసుకోవాలని మున్సిపల్ మేనేజర్ జె.శ్రీదేవి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని పోలీంగ్ స్టేషన్లలో ఓటర్ స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. 18 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకున్న యువతీ యువకులు ఫారం–6 నింపి ఐటీ ప్రూఫ్, అడ్రస్ ప్రూఫ్ జతపరిచి నూతన ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓటరు ఐడీ సవరణలు ఉంటే ఫారం–8లో సరి చేసుకోవాలని సూచించారు. బీఎల్ఓలు పోలీంగ్ స్టేషన్ల వద్ద అందుబాటులో ఉంటారని, అన్ని విషయాల్లో వారు సహాయపడతారని చెప్పారు.

రైతు సాధికారతకు కృషి చేయాలి

పద్మశ్రీ అవార్డు గ్రహీత, రైతు చింతల వెంకటరెడ్డి

మేడ్చల్‌రూరల్: రైతు సాధికారతకు కృషి చేయాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, రైతు చింతల వెంకటరెడ్డి అన్నారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో శనివారం ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిసాన్ మహోత్సవం నిర్వహించారు. ఏరువాక ఫౌండేషన్ వ్యవసాయ వార్షిక అవార్డుల ప్రదానోత్సవం, ఎగ్జిబిషన్, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు సెమినార్లు, చర్చావేదికలు నిర్వహించారు. పద్మశ్రీ వెంకటరెడ్డి, ఏరువాక ఫౌండేషన్ స్థాపకులు రాఘవరావు, మల్లారెడ్డి యూనివర్సిటీ డైరెక్టర్ ప్రీతిరెడ్డి, యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ డీన్ రాజారెడ్డి వ్యవసాయ రంగంలో రాణిస్తున్న ఉత్తమ రైతులు, శాస్త్రవేత్తలు, జర్నలిస్టులు, అగ్రి విద్యార్థులకు అవార్డులు అందజేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ జలపతిరావు, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షుడు వీరభద్రరావు, గ్రామ భారతి అధ్యక్షులు సూర్యకళ, అగ్రి హార్టికల్చర్ సొసైటీ కార్యదర్శి సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ రైతులకు అవార్డులు అందజేస్తున్న వెంకటరెడ్డి తదితరులు

మేడ్చల్ ఎస్ఐ నర్సింహాగౌడ్‌కు సేవా పతకం



సైబరాబాద్ సీపీ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్ఐ నర్సింహాగౌడ్

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ఎస్ఐ నర్సింహాగౌడ్‌కు సేవా పతకం అవార్డు దక్కింది. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులకు ప్రభుత్వం ప్రత్యేక సేవా పతకం అవార్డులను అందిస్తోంది. ఈ అవార్డుల్లో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నర్సింహాగౌడ్ అవార్డుకు ఎంపికయ్యారు. కమిషనర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి చేతులమీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ నర్సింహారెడ్డి ఆయనను అభినందించారు.

అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు



సీసీ పనులు పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ 18వ వార్డులో రూ.9 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు చైర్ పర్సన్ పావనీజంగయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. సీసీ పనులు నాణ్యత కలిగి ఉండాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, విజయ్‌ముదిరాజ్, ఫయామ్, సన్నీ పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలొద్దు

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



మల్కాజిగిరి: ఎన్నికలు, అభివృద్ధి వేర్వేరు అంశాలని వాటిని కలిపి రాజకీయాలు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. నేరేడ్‌మెట్ ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో స్ట్రీట్ వెండర్స్ ఏర్పాటు చేసుకున్న దుకాణాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. అధికారుల తీరుకు నిరసనగా సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్న వ్యాపారాలు నిర్వహించడానికి ప్రభుత్వమే చిరు వ్యాపారులకు గుర్తింపుకార్డులు అందజేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రుణాలు పొంది వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో ఓడిపోయామని కక్షతో వీధివ్యాపారులను నష్టపరుస్తుమంటే ఊరుకోమన్నారు. దీనికి బాధ్యులైన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం జోనల్ కమిషనర్ రవికిరణ్ ఎమ్మెల్యేతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. కార్పొరేటర్ మురుగేష్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ తదితరులు హాజరయ్యారు.

కార్పొరేటర్ల గైర్హాజరు..

స్థానిక ఎమ్మెల్యే అధికారులు, ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. సర్కిల్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాకు పార్టీ కార్పొరేటర్లు ఇద్దరూ గైర్హాజరు కాగా.. ధర్నాలో వారి భర్తలు పాల్గొనడం గమనార్హం.

పోచారం సీఐగా రాజుకు బాధ్యతలు



పోచారం: పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బి.రాజు శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు సీఐగా పనిచేసిన వి.అశోక్‌రెడ్డి రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఎస్ఓటీ–2కు బదిలీపై వెళ్లారు. రాచకొండ సైబర్ క్రైమ్ విభాగం నుంచి ఆయన పోచారం పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చి విధుల్లో చేరారు.

సంస్కృతిలో 'స్వచ్ఛ టెంపుల్'



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో స్వచ్ఛ టెంపుల్ కార్యక్రమాన్ని కౌన్సిలర్ బి.హరిప్రసాదరావు ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు ఆలయాలు, వాటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేస్తున్నట్లు చెప్పారు. స్వచ్ఛ టెంపుల్ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొన్న టౌన్‌షిప్‌వాసులను అభినందించారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ జంగయ్యను వారి నివాసంలో విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు కలిసి అయోధ్య రామయ్య అక్షింతలను శనివారం అందజేశారు. అలాగే ఎంపీపీ సుదర్శన్‌రెడ్డికి మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మం, హిందూ సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో హనుమాన్, మహిపాల్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, విశ్వహిందు పరిషత్ ఉప్పల్ బాగ్ కార్యదర్శి సురేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మంద కృష్ణను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



మంద కృష్ణను కలిసిన మేడ్చల్ ఎమ్మార్పీఎస్ నాయకులు

మేడ్చల్: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు కమిటీ ఏర్పాటు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ మండల నాయకులు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణను కలిసి సన్మానించారు. ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ చేసిన పోరాటాలు వృథా కాలేదని అన్నారు. మాదిగల కల నెరవేరే సమయం అసన్నమైందని నాయకులు అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు పరశురాం మాదిగ, నాయకులు బాలకృష్ణ, రామకృష్ణ, శివ, బాలనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల పాటు పిల్లలకు పలు కార్యక్రమాలు



సాక్షి, మేడ్చల్‌జిల్లా: బేటీ బచావో– బేటీ పడావో పథకంలో భాగంగా జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో వారం రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి జి.క్రిష్టారెడ్డి తెలిపారు. అందులో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పోస్టర్‌తో పాటు బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పద్మజారాణి, డీఇఓ విజయకుమారి, సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు, పిల్లల లింగ నిష్పత్తిపై గ్రామస్థాయిలో మహిళా సభలు, ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తామని జిల్లా సంక్షేమ అధికారి జి.క్రిష్టారెడ్డి పేర్కొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు కూడా అందజేస్తామన్నారు.

22న సెలవు ప్రకటించాలి

మేడ్చల్: ఈ నెల 22వ తేదీన అయోధ్యలోని రామ మందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆ రోజున ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, కండ్లకోయ కౌన్సిలర్ హంసరాణి డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని హిందువుల మనోభావాలను గౌరవిస్తూ శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వీలుగా సెలవు రోజుగా ప్రకటించాలని కోరారు. ప్రజలందరూ రాముడి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రసార మాధ్యమాల్లో చూడాలని, ఆలయాల వద్దకు వచ్చేవారు ఈ కార్యక్రమాన్ని వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



కీసర: నాగారం మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు లక్ష్మీనగర్‌కాలనీలో సుమారు రూ.6 లక్షల మున్సిపల్ నిధులు వెచ్చించి చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బదనపురం శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే 'స్వచ్ఛ మేడ్చల్'



అయ్యప్ప ఆలయంలో చైర్ పర్సన్ దీపికారెడ్డి

మేడ్చల్: మేడ్చల్‌ను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దడంతో పట్టణ ప్రజలందరూ భాగాస్వాములు కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ దీపికానర్సింహారెడ్డి కోరారు. స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మేడ్చల్ పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దడానికి మున్సిపల్ సిబ్బంది, పాలకవర్గం అహర్నిషలు కృషి చేస్తోందని, ప్రజలు భాగస్వాములైతే త్వరగా సాధ్యమన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, చెత్తను తరలించే బండ్ల వారికే చెత్తను అందజేయాలని కోరారు. స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో భాగంగా అయ్యప్ప ఆలయం, పరిసరాల్లో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, సిబ్బంది ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు నేలమట్టం

- ప్రభుత్వ, అసైన్డ్ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు
- నిర్మాణాలు కూల్చివేయించిన తహసీల్దార్ అశోక్‌కుమార్

కీసర: ప్రభుత్వ, అసైన్డ్ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్–151, 586లోగల ప్రభుత్వ స్థలాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను శనివారం జేసీబీ సహాయంతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం కీసర మండల రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ, అసైన్డ్ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆర్ఐ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని వివిధ గ్రామాల్లో అసైన్డ్ స్థలాలు మరికొన్ని అన్యాక్రాంతం అయ్యాయని వాటిని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.




దమ్మాయిగూడలోని సర్వే నెంబర్-151, 586లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు